# వీటోతో కట్టడి.. బడ్జెట్‌కు అనుమతి.. విచక్షణతో ప్రోరోగ్

## రాష్ట్రపతి వీటో అధికారాలు

- వీటో అనే పదం లాటిన్ భాష నుంచి గ్రహించారు. ఆంగ్లంలో దాన్ని ఫర్బిడ్ అంటారు. వీటో అంటే నిరోధించే/ తిరస్కరించే అధికారం. భారత రాజ్యాంగంలో వీటో అనే పదం ఎక్కడ పేర్కొనలేదు. ఏదైనా బిల్లును , ప్రతిపాదన కాని పార్లమెంట్ ఆమోదించిన తర్వాత రాష్ట్రపతి ఆమోదానికి పంపితే ప్రకరణ 111 ప్రకారం రాష్ట్రపతి కింది ప్రత్యామ్నాయాలను కలిగి ఉంటాడు.
  ఎ) బిల్లును ఆమోదించవచ్చు
  బి) బిల్లును ఆమోదించకుండా ఉండవచ్చు
  సి) పునః పరిశీలనకు పంపవచ్చు (ద్రవ్య బిల్లు తప్ప మిగతా బిల్లులను)
  డి) బిల్లుపై మౌనం వహించవచ్చు.
- ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలో కింది వీటో అధికారాలున్నాయి.
  1) అబ్సల్యూట్ వీటో
  2) క్వాలిఫైడ్ వీటో
  3) సస్పెన్సివ్ వీటో
  4) పాకెట్ వీటో

## అబ్సల్యూట్ వీటో

- పార్లమెంట్ ఆమోదించిన బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపినపుడు, రాష్ట్రపతి ఏదైనా కారణం చూపించిగాని, కారణం చూపకుండా గాని ఆ బిల్లును తిరస్కరించడాన్ని అబ్సల్యూట్ వీటో అంటారు. ఏదైనా బిల్లును తిరస్కరిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ చట్టంగా మారదు. ఆ బిల్లు శాశ్వతంగా రద్దవుతుంది. రాష్ట్రపతి కింది సందర్భాల్లో అబ్సల్యూట్ వీటోను వినియోగించవచ్చు.
  ఎ) ప్రైవేట్ మెంబర్స్ బిల్లుల విషయంలో (మంత్రులుకాని సభ్యులు ప్రవేశపెట్టే బిల్లులను ప్రైవేట్ బిల్లులంటారు)
  బి) క్యాబినెట్ ఆమోదం పొందిన ప్రభుత్వ బిల్లులు రాష్ట్రపతి ఆమోదానికి పంపిన తర్వాత, రాష్ట్రపతి ఆమోదం తెలపక ముందే మంత్రిమండలి రాజీనామా చేస్తే కొత్తగా ఏర్పడిన మంత్రిమండలి ఆ బిల్లులను ఆమోదించవద్దని రాష్ట్రపతికి సలహా ఇచ్చినప్పుడు భారత రాష్ట్రపతి ఈ అధికారాన్ని వినియోగించుకోవచ్చు.

**ఉదా:** 1954లో రాజేంద్రప్రసాద్ రాష్ట్రపతిగా ఉన్నప్పుడు పాటియాలా ఈస్ట్ పంజాబ్ స్టేట్స్ యూనియన్ అనుమతి ఉపక్రమణ బిల్లుకు అబ్సల్యూట్ వీటోను వినియోగించారు. కారణం ఈ బిల్లును రూపొందించినపుడు పంజాబ్ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన ఉంది. అయితే ఈ బిల్లును పార్లమెంట్ ఆమోదించి రాష్ట్రపతికి పంపిన సమయానికి రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనను తొలగించారు.


- 1991లో ఆర్.వెంకట్రామన్ రాష్ట్రపతిగా ఉన్న సమయంలో పార్లమెంట్ సభ్యుల జీతభత్యాలు, అలవెన్సులకు సంబంధించిన బిల్లులో అబ్సల్యూట్ వీటోను వినియోగించారు. (రాష్ట్రపతి పూర్వానుమతి లేకుండా లోక్‌సభ రద్దయ్యే ముందురోజు పార్లమెంటు ఈ బిల్లును ఆమోదించింది)
- రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లును ప్రకరణ 200 ప్రకారం గవర్నర్, రాష్ట్రపతి ఆమోదానికి నివేదించవచ్చు. ఈ సందర్భంలో రాష్ట్రపతి తన ఆమోదాన్ని నిరాకరిస్తే ఆ బిల్లు ఎప్పటికీ చట్టంగా మారదు.

### క్వాలిఫైడ్ వీటో

- పార్లమెంట్ ఆమోదించిన బిల్లు రాష్ట్రపతి ఆమోదానికి పంపితే ఆ బిల్లును రాష్ట్రపతి తిరస్కరిస్తే రెండో పర్యాయం అదే బిల్లును 2/3 వంతు మెజారిటీతో ఆమోదించి పంపితే రాష్ట్రపతి తప్పనిసరిగా ఆమోదం తెలపాలి. అంటే రాష్ట్రపతి అధికారాన్ని పార్లమెంట్ 2/3 వంతు మెజారిటీ అధిగమించే అధికారాన్ని కలిగి ఉంటుంది. ఈ తరహా వీటో అధికారం భారత రాష్ట్రపతికి లేదు. ఈ అధికారం అమెరికా అధ్యక్షుడికి ఉంది.

### సస్పెన్సివ్ వీటో

- పార్లమెంట్ ఒక బిల్లును ఆమోదించి రాష్ట్రపతికి పంపితే రాష్ట్రపతి దాన్ని పునఃపరిశీలన కోసం పార్లమెంటుకు పంపినపుడు పార్లమెంటు సవరణలు చేసిగాని సవరణలు లేకుండాగాని అదే బిల్లును సాధారణ మెజారిటీతో తిరిగి పంపితే భారత రాష్ట్రపతి ఆ బిల్లులను తప్పనిసరిగా ఆమోదించాలి. అంటే రాష్ట్రపతి వీటో అధికారాన్ని పార్లమెంట్ సాధారణ మెజారిటీతో అధిగమించే అధికారాన్ని కలిగి ఉంది. రెండోసారి ఆమోదించకపోయినా ఆమోదించినట్లే భావిస్తారు. ఈ అధికారం భారత రాష్ట్రపతికి ఉంది.
- 2006లో రాష్ట్రపతి అబ్దుల్ కలాం దేశ మంతటికీ ఒకే రీతిన వర్తించేలా నిబంధనలు లేవన్న కారణంగా జోడు పదవుల బిల్లుపై సంతకం చేయకుండా తిప్పి పంపారు. అంటే సస్పెన్సివ్ వీటోను వినియోగించారు.




### పాకెట్ వీటో

- బిల్లులను పార్లమెంట్ ఆమోదించి రాష్ట్రపతి ఆమోద ముద్రకు పంపినప్పుడు ఆ బిల్లులను తిరస్కరించకుండా, పునఃపరిశీలనకు పంపకుండా రాష్ట్రపతి నిరవధికంగా తన నిర్ణయాన్ని వాయిదా వేస్తే దాన్నే పాకెట్ వీటో అంటారు.
- ఉదాహరణకు 1986లో రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు అప్పటి రాష్ట్రపతి జైల్‌సింగ్ పోస్టల్ బిల్లు విషయంలో ఈ వీటో అధికారాన్ని వినియోగించారు.
- ఒక బిల్లును గాని, ప్రతిపాదనను గాని రాష్ట్రపతి ఆమోదానికి పంపినప్పుడు రాష్ట్రపతి ఎంతకాలంలోపు ఆమోదించాలన్న అంశం మన రాజ్యాంగంలో పేర్కొనలేదు. కాబట్టి భారత రాష్ట్రపతి పాకెట్ వీటో వినియోగించుకుంటున్నారు.

### రాష్ట్రపతి వీటో చేయడానికి అవకాశం లేని బిల్లులు

1) రాజ్యాంగ సవరణ బిల్లులు
2) ద్రవ్య బిల్లులు
3) రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ బిల్లులు

రాష్ట్ర శాసనాలపై కూడా వీటో అధికారం ఉంటుంది:

- రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన కొన్ని బిల్లులను ప్రకరణ 200 ప్రకారం గవర్నర్ రాష్ట్రపతికి పంపిస్తారు. ఆ బిల్లులను ప్రకరణ 201 ప్రకారం రాష్ట్రపతి ఆమోదించవచ్చు. లేదా తిరస్కరించవచ్చు (అబ్సల్యూట్ వీటో). లేదా పునఃపరిశీలన నిమిత్తం రాష్ట్ర శాసనసభకు పంపమని గవర్నర్‌ను కోరవచ్చు. ఈ విధంగా పంపిన బిల్లులను సవరణలతోగాని సవరణలు లేకుండాగాని రాష్ట్ర శాసనసభలు ఆమోదించి తిరిగి రాష్ట్రపతికి పంపితే రాష్ట్రపతి ఎంతకాలమైనా తన దగ్గరే ఉంచుకోవచ్చు (పాకెట్ వీటో) లేదా ఆమోదించవచ్చు.

## ఆర్థిక అధికారాలు

- ద్రవ్యబిల్లులను రాష్ట్రపతి అనుమతితో లోక్‌సభలోనే ప్రవేశ పెట్టాలి (ప్రకరణ 117(1))
- ప్రతి ఆరు సంవత్సరాలకు ఒక ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేయడం (ప్రకరణ 280)
- భారత ఆగంతుక నిధి రాష్ట్రపతి ఆధీనంలోనే ఉంటుంది. దానినుంచి పార్లమెంట్ ఆమోదం పొందేవరకు వచ్చే అత్యవసర ఖర్చులకు అడ్వాన్స్‌లను మంజూరు చేయడం (ప్రకరణ 267)
- ప్రతి ఆర్థిక సంవత్సరంలో వార్షిక బడ్జెట్‌ను సప్లిమెంటరీ బడ్జెట్‌ను తన పేరుతో పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టడానికి అనుమతినివ్వడం. (ప్రకరణ 112) రాష్ట్రపతి సిఫారసు లేనిదే గ్రాంట్లకు డిమాండ్ చేయరాదు

## న్యాయాధికారాలు

- ప్రకరణ(72(1)) ప్రకారం రాజ్యాంగ అధినేతగా ఉన్నత న్యాయస్థానాలు విధించిన శిక్షలను నిలిపివేయవచ్చు లేదా శిక్ష అమలు వాయిదా వేయవచ్చు లేదా ఒక రకమైన శిక్షను మరొక రకమైన శిక్షగా మార్చవచ్చు. కోర్టులు రాష్ట్రపతి న్యాయాధికారాల్లో జోక్యం చేసుకోవు.

**క్షమాభిక్ష** (Pardon): నేరస్థుడికి విధించిన శిక్షను పూర్తిగా రద్దు చేయడం.

**మినహాయింపు** (Remission): నేరస్థుడికి విధించిన శిక్షా కాలాన్ని శిక్ష స్వభావం మార్చకుండా తగ్గించవచ్చు. (కఠిన కారాగార శిక్షకు గురైన వ్యక్తి శిక్షాకాలాన్ని మాత్రమే తగ్గించడం)

**మార్పు** (Commutation): నేరస్థుడికి విధించిన శిక్ష స్వభావాన్ని మార్చవచ్చు కాని శిక్షను రద్దు చేయరాదు.

**నిలుపుదల** (Reprieve): నేరస్థుడికి విధించిన శిక్షను తాత్కాలికంగా వాయిదా వేయడం.

**ఉదా:** మరణ శిక్ష విధించిన నేరస్థుడు రాష్ట్రపతి క్షమాభిక్ష కోరిన సందర్భంలో రాష్ట్రపతి తన నిర్ణయాన్ని వెలువరించే వరకు మరణశిక్షను తాత్కాలికంగా వాయిదా వేయడం.

**విరామం**(Respite)
ప్రత్యేక పరిస్థితుల్లో నేరస్థుడికి విధించిన శిక్షను (నేరస్థులు మానసిక సమతౌల్యం కోల్పోయినపుడు మహిళానేరస్థులు గర్భవతులుగా ఉన్నప్పుడు) రాజీవ్‌గాంధీ హత్యకేసులో నేరస్థురాలైన నళిని గర్భవతి కావడంతో మరణశిక్షను యావజ్జీవ శిక్షకు తగ్గించారు.

- క్షమాభిక్ష అధికారాలను కేబినెట్ సిఫారసుల మేరకే రాష్ట్రపతి ప్రసాదిస్తారు.
- రాష్ట్రపతికి గల క్షమాభిక్ష అధికారాలు రాష్ట్రపతికి గల కార్యనిర్వాహక అధికార పరిధిలోకి వస్తాయి.

## సైనికాధికారాలు

- ప్రకరణ 53(2) ప్రకారం రాష్ట్రపతి భారత సర్వసైన్యాధిపతి. అతడు త్రివిధ దళాలకు అధిపతి
- సైన్యాధిపతిని, నౌకాదళ అధిపతిని రాష్ట్రపతి నియమిస్తాడు.
- యుద్ధం ప్రకటించడానికి, సంధి షరతులు చేసుకోవడానికి రాష్ట్రపతికి అధికారం ఉంది (పార్లమెంట్‌కు లోబడి).
- రక్షణ శాఖను నిర్వహించే రక్షణ మంత్రిని, రక్షణ మంత్రిత్వశాఖలోని ముఖ్యమైన అధికారులను నియంత్రించడం మొదలైనవి.

### దౌత్యపరమైన అధికారాలు

- అంతర్జాతీయ వ్యవహారాల ప్రతినిధి.
- మిత్రదేశాలకు రాయబారులను నియమించడం.
- భారతదేశానికి, ఇతర దేశాలకు మధ్య సంబంధాలను పెంపొందించడానికి కృషి చేయడం.
- ఐక్యరాజ్యసమితికి భారతదేశ ప్రతినిధులను నియమించడం.
- అంతర్జాతీయ సంధి షరతులు, ఒప్పందాలు రాష్ట్రపతి పేరు మీదుగానే జరుగుతాయి.

## రాష్ట్రపతి విచక్షణాధికారాలు

- ప్రకరణ 74(1) ప్రకారం కేంద్ర మంత్రి మండలి తనకు ఇచ్చిన సలహాపై పునరాలోచన చేయవలసిందిగా కేంద్ర మంత్రిమండలిని రాష్ట్రపతి కోరవచ్చు.



- ప్రకరణ 78(ఎ) ప్రకారం కేంద్ర మంత్రి మండలి కార్యకలాపాలను నిర్ణయాలను రాష్ట్రపతికి ఎప్పటికప్పుడు తెలియజేయడం ప్రధానమంత్రి బాధ్యత
- ప్రకరణ 78(సి) ప్రకారం ఒక మంత్రితో నిర్ణయించి, కేంద్రమంత్రి మండలి పరిశీలన జరపని నిర్ణయాలపై పరిశీలన జరపవలసిందిగా రాష్ట్రపతి కోరవచ్చు.
- ప్రకరణ 85(1) ప్రకారం పార్లమెంట్‌ను సమావేశపరచడానికి తేదీలను, స్థలాన్ని రాష్ట్రపతి నిర్ణయిస్తారు.
- పార్లమెంట్ సమావేశాలు ప్రతి ఆరునెలలకోసారి జరిగేటట్లు రాష్ట్రపతి తేదీ నిర్ణయిస్తూ ఆదేశాలు జారీ చేస్తారు.
- ప్రకరణ 85(2) ప్రకారం సమయానుకూలంగా రాష్ట్రపతి పార్లమెంట్ ఉభయ సభలను ఒక్కొక్క సభను ప్రోరోగ్‌చేయడం, తగిన మెజారిటీ లేకపోతే లోక్‌సభను రద్దు చేయడం వంటి అధికారాన్ని కలిగి ఉంటాడు.
- ఆపద్ధర్మ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను రాష్ట్రపతి నియంత్రిస్తాడు
- ఏ పార్టీకీ పూర్తి మెజారిటీ లభించని సందర్భంలో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే సమయంలో రాష్ట్రపతి తన విచక్షణాధికారాన్ని ఉపయోగించి తగిన నిర్ణయం తీసుకుంటాడు.
- 42వ రాజ్యాంగ సవరణ (1976) ప్రకారం రాష్ట్రపతి కేంద్ర మంత్రి మండలి సలహాకు బద్ధుడై ఉండాలి. అయితే 44వ రాజ్యాంగ సవరణ (1978) ఈ విషయంలో కొన్ని మార్పులను చేసింది. మంత్రిమండలి ఇచ్చిన సలహాను పునఃపరిశీలించమని రాష్ట్రపతి ఒకసారి కోరవచ్చు.
- మంత్రి మండలి పునర్‌పరిశీలించి ఆ సలహాను యథాతథంగా రాష్ట్రపతికి పంపినా లేదా మార్పులతో రాష్ట్రపతికి పంపినా రాష్ట్రపతి కచ్చితంగా ఆమోదించి తీరాలని 44వ రాజ్యాంగ సవరణ ద్వారా 74వ ప్రకరణను సవరించారు. పునఃపరిశీలనకు పంపే అధికారం రాష్ట్రపతికి ఒక సలహా విషయంలో ఒకసారి ఉంటుంది. భారత రాజ్యాంగంలో కేబినెట్ అనే పదాన్ని 44వ రాజ్యాంగ సవరణ (1978) ద్వారా చేర్చారు. అంతకు ముందు ఈ పదం రాజ్యాంగంలో లేదు.

## అత్యవసర అధికారాలు

- భారత రాజ్యాంగంలోని 18వ భాగంలో ప్రకరణ 352 నుంచి 360 వరకు గల మొత్తం 9 ప్రకరణల్లో అత్యవసర పరిస్థితులకు సంబంధించిన అంశాలను పేర్కొన్నారు. అసాధారణ పరిస్థితుల్లో దేశ సార్వభౌమత్వ ఐక్యత, సమగ్రతలను పరిరక్షించడానికి అత్యవసర అధికారాలను రాజ్యాంగంలో పొందుపరచడం జరిగింది.

వీటిని 1935 భారత ప్రభుత్వ చట్టం నుంచి గ్రహించారు. ఈ అధికారాలు సమాఖ్య వ్యవస్థకు వ్యతిరేకం అయినప్పటికీ జాతి ప్రయోజనాల దృష్ట్యా అనివార్యమని రాజ్యాంగ పరిషత్తు చర్చల్లో డా. బీఆర్ అంబేద్కర్ గట్టిగా సమర్థించారు.